# రైతులు అప్రమత్తంగా ఉండాలి

- చెన్నూర్ మండల వ్యవసాయశాఖ అధికారి కవిత



చెన్నూర్ రూరల్ : రైతులతో మాట్లాడుతున్న ఏఈవో సాగర్

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 5: వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి కవిత సూచించారు. చెన్నూర్ మండలంలోని ఆస్నాద్, కొమ్మెర, పొక్కూర్, ఒత్కులపల్లి, కిష్టంపేట, సుందరశాల, దుగ్నెపల్లి గ్రామాల్లో వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. రెండు రోజులుగా రాష్ట్రమంతా వాతావరణం చల్లబడిందని, తుఫాన్ కారణంగా రానున్న రెండు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండవచ్చని హెచ్చరించారు. వరి ధాన్యం కుప్పలపై టార్పలిన్ కవర్లను కప్పాలని సూచించారు. ధాన్యాన్ని నేలపై ఆరబోయవద్దని సూచించారు. కోతకు వచ్చిన వరి పంటను రెండు మూడు రోజుల తర్వాత కోయాలని తెలిపారు. రైతులు కరెంటు కోసం విద్యుత్ మోటర్ల వద్దకు వెళ్లవద్దని సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని ఏవో కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సాగర్, రాజశేఖర్, దివ్య, వనదేవి పాల్గొన్నారు.

**అకాల వర్షాలతో రైతుల ఆందోళన**

నెన్నెల, డిసెంబర్ 5 : కోతకు వచ్చిన వరి పొలాలు, అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం కుప్పలు తడిసి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో పాటు అక్కడక్కడా వర్షం భారీగానే పడుతున్నది. దీంతో ధాన్యం తడిసి మొలకెత్తే ప్రమాదం ఉందని ధాన్యం రంగుమారి నష్టం వస్తుందంటున్నారు. కొనుగోలు దారులు రాక పోవడంతో కుప్పలు అలాగే ఉన్నాయి. సన్న రకాలనే కొనుగోలు దారులు సేకరిస్తున్నారు. వర్షాలతో కొనుగోలు దారులు కూడా ముందుకు రావడం లేదు. చేతికి వచ్చిన పంట నష్టపోయేలా ఉందని రైతులు కుప్పలపై టార్పలిన్ కవర్లు వేసి వర్షం నుంచి కాపాడుకోవడానికి ప్రయతిస్తున్నారు. రాత్రి నుంచి అక్కడక్కడా వర్షం పడుతుండడంతో పత్తి పంట కూడా దెబ్బతింటుందని పత్తి రంగు మారి నల్లబడి ధర పడి పోతుంది.

**భీమారం మండలంలో..**

భీమారం, డిసెంబర్ 5 : తుపాను ప్రభావంతో మండలంలో చల్లటి వాతావరణంతో పాటు ఉదయం నుంచి చిరు జల్లులు పడుతున్నాయి. దీంతో పత్తి, వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిధాన్యాన్ని కల్లంలో పోశారు. చేతి వచ్చిన పంట నష్టం పోయేలా ఉన్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా వర్షం ఉదయం నుంచి కురుస్తున్నది.



కన్నెపల్లి : వరిధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు

**కన్నెపల్లిలో..**

కన్నెపల్లి, డిసెంబర్ 5 : వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లోనే ధాన్యం, పత్తి చేన్లలోనే ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా మబ్బులు కమ్ముకుని చిరు జల్లులు కురుస్తుండడంతో ధాన్యం కల్లాల్లో ఉండడంతో భారీ వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. ధాన్యం కుప్పలపై టార్పాలిన్‌లు కప్పుతున్నారు.



భీమారం : కల్లంలో ధాన్యం కుప్పలపై టార్పలిన్ కవర్లు కప్పిన రైతులు



నెన్నెల మండలంలో..

## కోనంపేటలో పంట కోత ప్రయోగం



కోనంపేటలో వరిలో పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

నెన్నెల, డిసెంబర్ 5: మండలంలోని కోనంపేట గ్రామంలోని వరి క్షేత్రాల్లో వ్యవసాయ అధికారులు పంట కోత ప్రయోగం చేశారు. మంగళవారం ఏఈవో రాంచందర్ పలువురు రైతులు వరి పంట ఎకరానికి ఎంత పంట దిగుబడి వచ్చిందన్న అంచనా కోసం పంట కోత ప్రయోగం నిర్వహించారు. గ్రామాల వారీగా పంటలపై ప్రయోగాలు చేసి పంట దిగుబడిని అంచనా వేసి జిల్లా స్టాటిస్టిక్స్ అధికారులకు పంపనున్నట్లు ఏఈవో తెలిపారు. దీని ఆధారంగా గ్రామానికి ఒక యూనిట్‌గా ప్రయోగాలు చేసి మండలంలో పంట దిగుబడిని అంచనా వేస్తమని చెప్పారు.

## నర్సరీల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఎంఏ అలీం

కాసిపేట, డిసెంబర్ 5 : కాసిపేట మండలంలోని సోమగూడెం(కే)తో పాటు కాసిపేట పంచాయతీలోని సండ్రల్‌పాడ్‌లోని నర్సరీలను ఎంపీడీవో ఎంఏ అలీం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి పాల్గొన్నారు.

## ఈజీఎస్ పనుల పరిశీలన



కుంట పనులను పరిశీలిస్తున్న ఏపీవో సత్య ప్రసాద్

వేమనపల్లి, డిసెంబర్ 5 : మండలంలోని మంగెనపల్లిలో జరుగుతున్న చిన్న నీటి కుంట పనులను ఏపీవో సత్య ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. పనులను కొలతల ప్రకారం నిర్వహించాలని సూచించారు. అనంతరం సుంపుటం గ్రామంలో నర్సరీ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేసి మొక్కలు నాటాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ కొండగొర్ల బాపు, సాంకేతిక సహాయకులు కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శి సిరాజ్, క్షేత్ర సహాయకులు రాజన్న, సంజీవ్ తదితరులు ఉన్నారు.

## యూడైస్ పై శిక్షణ



మాట్లాడుతున్న కోటపల్లి ఎంఈవో తిరుపతి రెడ్డి

కోటపల్లి, డిసెంబర్ 5 : కోటపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూడైస్ ప్లస్ 2023-24 పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పాఠశాలలోని భౌతిక వసతులు, విద్యార్థుల వివరాలు, ఉపాధ్యాయుల వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎంఈవో తిరుపతి రెడ్డి సూచించారు. తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు సంపత్, గణపతి, మొగిలి, ఎంఐఎస్, మల్లేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

తాండూర్, డిసెంబర్ 5 : మండల కేంద్రంలోని తాండూర్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 6న బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ఏఈ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని తాండూరు, బెల్లంపల్లి, కాసిపేట మండలాల వినియోగదారులకు ఏమైనా విద్యుత్ సమస్యలుంటే తెలియజేసి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ సీజీఆర్ఎఫ్ అధికారులు, బెల్లంపల్లి డీఈ బీ రాజన్న, ఏడీ కే శ్రీనివాస్ రానున్నట్లు తెలిపారు.

## సైన్స్ పోటీల్లో పాల్గొన్న జిల్లా విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 5 : హైదరాబాద్ లోని బేగంపేటలో గల సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌లో నిర్మల్ జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొన్నారు. ఆరోగ్యం, సంక్షేమం, పర్యావరణం అనే అంశంపై విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా నుంచి సుమిత్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దిలావర్‌పూర్, అలియన సుమ శ్రీ చైతన్య హైస్కూల్, వైశాలి, వాసవి మాడల్ స్కూల్, సుచరిత్ విజయ హైస్కూల్ నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న విద్యార్థుల ను డాక్టర్ రవీందర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్, ఎన్‌సీఎస్‌సీ అకాడమీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, గైడ్ టీచర్ ప్రియ, శ్వేత, సాజిద్, బావన తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం



వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

భైంసా, డిసెంబర్ 5 : భైంసాలోని గౌతమి పాఠశాలలో మంగళవారం ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్లంలో వరల్డ్ సాయిల్ డే ఆకారంలో కూర్చున్నారు. పలువురు ఉపాధ్యాయులు నేల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ రవీందర్, గంగుతాయి, ముత్యం, భోజేందర్, సవిత, అమ్రపాలి, విద్యార్థులు ఉన్నారు.

## 'వాసవి'కి బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 5 : జిల్లా కేంద్రంలోని వాసవి పాఠశాలకు అరుదైన గౌరవం దక్కింది. ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ అసోసియేషన్, నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ స్కూల్ అండ్ ఎడ్యూకేటర్స్ ఆధ్వర్యంలో బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డును అందజేశారు. ముంబైలోని సిద్ధం కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనామిక్స్‌లో జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌కు ప్రోగ్రెసివ్ లీడర్ షిప్ అవార్డును మంగళవారం అందించారు. రాజ్‌కుమార్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోతారెడ్డి, కార్యదర్శి జగదీశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.